క్లుప్తంగా

రామావతారంలో పాండురంగడు



భక్తులకు దశావతారంలో దర్శనమిచ్చిన పాండురంగస్వామి

పాయకరావుపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి భక్తులకు సోమవారం రామావతారంలో దర్శనమిచ్చారు. దశావతారాల్లో భాగంగా రామావతారం అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకుని తరించారు. భక్తులకు ఆలయ అర్చకుడు కృష్ణస్వామి తీర్థ ప్రసాదాలు అందించారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న మారిశెట్టి సూర్యనారాయణ

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామానికి చెందిన మారిశెట్టి సూర్యనారాయణ ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.25 వేలు విరాళాన్ని ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద రెయిలింగ్ ఏర్పాటు



మెలిపాక దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రెయిలింగ్

మునగపాక: మెలిపాక దళితవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కర రాజు తన సొంత నిధులు రూ.40వేలు, ఇండస్ టవర్ నిర్వాహకులు రూ.60 వేలు వెరసి రూ.లక్షతో రెయిలింగ్ ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్నారు. రెయిలింగ్ ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభ్యసనా సామర్థ్యాలు పెరగాలి



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షిస్తున్న ఎంఈవో-1 రామారావు

కోటవురట్ల: పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంచేలా బోధన ఉండాలని ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సూచించారు. గొల్లపేట ఎంపీపీ స్కూల్‌ను ఎంఈవోలు సోమవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠ్య పుస్తకాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని సూచించారు. అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడేలా బోధన ఉండాలన్నారు.

తుస్సుమంటున్న రెవెన్యూ సదస్సులు

కూటమి ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం తప్ప రైతులకు మేలు చేయాలన్న ఆలోచన ఎక్కడా కనిపించడం లేదు. భూసమస్యలకు పరిష్కారమంటూ తూతూ మంత్రంగా సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకోవడం తప్ప వారికి ఒరిగిందేమీ లేదు. గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందించిన దరఖాస్తులకే ఇంత వరకు మోక్షం లేదని రైతులు మండిపడుతున్నారు. ఫలితంగా రైతుల నుంచి స్పందన లేకపోవడంతో గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు తుస్సుమంటున్నాయి.

- రైతుల నుంచి స్పందన కరవు
- పరిష్కారం చూపని సదస్సులెందుకంటూ నిట్టూర్పు
- ప్రచార ఆర్భాటం కోసమంటూ విమర్శలు
- మరో రెండు రోజుల్లో ముగియనున్న సదస్సులు





మునగపాక పంచాయతీ కార్యాలయంలో కానరాని రైతులతో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న డీటీ శేషుబాబు



కాకరాపల్లిలో ఆన్‌లైన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న రైతు మంగారెడ్డి(ఫైల్)

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. ఈ సదస్సుల ద్వారా రైతులు తమ భూములకు సంబంధించి ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకం, వన్‌బీ, అడంగల్, రీ-సర్వేలో లోపాలు, తదితర అంశాలకు సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రైతులకు సకాలంలో న్యాయం చేయాల్సి ఉంది. మునగపాక మండలంలోని 23 గ్రామాల్లో ఇంత వరకు నిర్వహించిన సదస్సుల ద్వారా అధికారులకు 173 దరఖాస్తులు అందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మండలంలో మరో రెండు రోజుల్లోగా సదస్సులు ముగియనున్నాయి. ఇంతవరకు ఒక్క దరఖాస్తుకు కూడా పరిష్కారం లభించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే రైతులు కూడా గతంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేసుకున్న దరఖాస్తులకు పరిష్కారం చూపకపోవడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న సదస్సులపై అంతగా ఆసక్తి చూపలేదు. పలు గ్రామాల్లో సదస్సులు వెలవెలబోతున్నాయి.

సదస్సులతో ఒరిగిందేమీ లేదు



రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులకు ఒరిగిందేమీ లేదు. కేవలం ప్రచార ఆర్భాటం తప్ప మేలు జరగడం లేదు. రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామంటూ అధికారులు ఊకదంపుడు ప్రచారం చేస్తున్నారు. మొక్కుబడి సదస్సులు నిర్వహించకుండా రైతుకు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలి.

– వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి

తొలి విడత అర్జీలకు మోక్షమెప్పుడో?

గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వేలో అక్కడక్కడా లోపాలు జరిగాయన్న ఆరోపణతో కూటమి ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 17 నుంచి గ్రామ సభలు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించింది. మండల వ్యాప్తంగా 26 పంచాయతీలకు 580 అర్జీలు అందాయి. రీ-సర్వేలో భూముల విస్తీర్ణంకు సంబంధించి తేడాలు, ఒక రైతుకు చెందిన భూమి మరో రైతు పేరిట ఇలా తప్పులు దొర్లడంతో వాటిని సాకుగా చూపి సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారానికి వాడుకున్నారు. సంబంధిత తప్పులను సవరిస్తామంటూ కూటమి ప్రభుత్వం సదస్సులు నిర్వహించినా ఇంతవరకు ఎటువంటి ఫలితం కనిపించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నెల 20 నుంచి రీ-సర్వేను ప్రారంభిస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నా రైతులు మాత్రం నమ్మం లేదు. గతంలో ఇచ్చిన దరఖాస్తులకే ఇంత వరకు న్యాయం జరలేదని, మరోసారి రీ-సర్వేకు సంబంధించి సదస్సులు నిర్వహిస్తామంటూ చెప్పడం ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

భూమి ఆన్‌లైన్ కోసం దరఖాస్తు చేశా..



తిమ్మరాజుపేటలో నాకు 41 సెంట్ల మేర వ్యవసాయ భూమి ఉంది. ఆన్‌లైన్‌లో కూడా నా పేరు చూపిస్తుంది. వ్యవసాయ రుణం కోసం బ్యాంక్‌కు వెళితే కేవలం 11 సెంట్ల మేర భూమి ఉన్నట్లు చూపిస్తుంది. దీంతో అధికారులు రుణం ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు న్యాయం జరగలేదు. వ్యవసాయ పెట్టుబడి కోసం రుణం తీసుకుందామన్నా బ్యాంక్ నిరాకరిస్తుంది.

– మళ్ల సాయిబునాయుడు, రైతు, తిమ్మరాజుపేట

ప్రతి అర్జీకి న్యాయం చేస్తాం..



రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలిస్తాం. ప్రతి వీఆర్వోకు రోజుకు రెండు చొప్పున దరఖాస్తులు అందజేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నాం. ప్రస్తుతం సదస్సులు జరుగుతున్నాయి. అవి పూర్తి కాగానే ప్రతి అర్జీకి న్యాయం జరిగేలా చూస్తాం. గతంలో రీ-సర్వేకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపైనా దృష్టి సారిస్తున్నాం.

–ఎస్.ఆదిమహేశ్వరరావు, తహసీల్దార్, మునగపాక మండలం

విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నివేదిక తనిఖీ



పీఎల్ పురం పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పట్టిక పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంతి

పాయకరావుపేట: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పరీక్షల నివేదిక తనిఖీ చేసినట్టు రాష్ట్రీయ బాల స్వస్థ ఎస్‌సీడీ ప్రొగ్రామింగ్ అధికారి ప్రశాంతి తెలిపారు. మండలంలోని పీఎల్ పురం పాఠశాలలో విద్యార్థులకు చేసిన ఆరోగ్య పరీక్షలు, రికార్డులను ఆమె సోమవారం పరిశీలించారు. గ్రామంలో అసంక్రమిత వ్యాధులకు చికిత్స నిర్ధారణపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సుభాష్, డాక్టర్ వి.సౌజన్య, ఈవో పి.వి.రమణ, ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంపోలు, ఉమ్మలాడ గ్రామాల్లో నేడు రెవెన్యూ సదస్సులు

మునగపాక: మండలంలోని ఒంపోలు, ఉమ్మలాడ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒంపోలు రామాలయం వద్ద, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉమ్మలాడ రామాలయం వద్ద జరిగే ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు



కె.వెంకటాపురంలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లోని చెత్తను తొలగించి డ్రైనేజీలలో పూడిక తీశారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. వీధుల్లో చెత్తను ఇష్టానుసారంగా వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు.

పని ఒత్తిడిపై సచివాలయ ఉద్యోగుల వినతి



ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మునగపాక: పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు సోమవారం ఎంపీడీవో ఎం.ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. గతంలో వలంటీర్లు చేసే పనులను ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ద్వారా జరుగుతున్నాయని, దీంతో పనిభారం పెరుగుతుందని పలువురు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. మండల కేంద్రాల్లో అటెండెన్స్ వేసే సదుపాయం లేకపోవడంతో కిలోమీటర్ల మేర సుదూర ప్రయాణం చేసి అటెండెన్స్ వేయాల్సి వస్తుందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ యూనియన్ మండల అధ్యక్షుడు ఆళ్ల దేవకి, ఉపాధ్యక్షుడు కె.రమేష్, కార్యదర్శులు ఎస్.పవన్, ఆర్.అశోక్ జయదీప్, కోశాధికారి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

తోటాడ కూడలి ఆధునికీకరణకు కృషి



తోటాడ కూడలిని పరిశీలిస్తున్న నేతలు, అధికారులు

మునగపాక: మండలంలోని తోటాడ కూడలిని ఆధునికీకరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు తెలిపారు. కూడలి అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో సోమవారం అధికారులు, కూటమి నేతలతో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడలి అభివృద్ధిలో భాగంగా కొంత మంది షాపులను తొలగించాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ రికార్డుల ప్రకారం ఆక్రమణలు తొలగిస్తామని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఆర్వో కన్నారావు, కూటమి నేతలు దొడ్డి రమేష్, పాలమరశెట్టి మురళి, వార్డు సభ్యులు రాపేటి పరమేష్, బుద్ద రమేష్‌నాయుడు, మళ్ల రవి, కొత్తలంక త్రినాథ్, కోరిబిల్లి వెంకట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మంచానికి పరిమితమైన లైన్‌మన్‌కు సాయం



వీరునాయుడుకు సాయం అందిస్తున్న సేవా వికాస్ సంస్థ సభ్యులు

మునగపాక: విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి మంచానికి పరిమితమైన సీనియర్ లైన్‌మన్ బొడ్డేడ వీరునాయుడుకు టి.సిరసపల్లికి చెందిన సేవా వికాస్ సంస్థ రూ.10 వేల సాయం సోమవారం అందజేసింది. గత 20 ఏళ్ల క్రితం వీరునాయుడు స్తంభం పైనుంచి పడిపోయి గాయపడ్డాడు. అప్పటి నుంచి మంచానికే పరిమితమైన వీరునాయుడు ట్రైసైకిల్ కోసం సంస్థను సంప్రదించారు. దీంతో ట్రైసైకిల్ కొనుగోలుకు సేవా వికాస్ సంస్థ సభ్యులు సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.

పదిలో శత శాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈవో-1 వేణుగోపాలరావు

మునగపాక: పదిలో శత శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు కోరారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో సోమవారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయిలో మోడల్ స్కూల్‌కు పేరు తీసుకువచ్చేలా పాటుపడాలని కోరారు. హెచ్ఎం శ్రీలక్ష్మి, సీఆర్పీ కర్రి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు గురై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిపై మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి పాలకవర్గం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పెద్దలు దాడి మునిలినాయుడు, టిక్కలి పరశురామ్, బీలా లక్ష్మణరావు, దొడ్డి గోవింద, శరగడం జగన్, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గాంధీ

పాయకరావుపేట: పాఠశాలల అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.ఎస్.గాంధీ సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లకు సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధుల ఖర్చు, మధ్యాహ్న భోజనంపై ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు తీసుకోవలసిన జాగ్రత్తలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. పాఠశాల రిసోర్స్ పర్సన్లు హరికృష్ణ, సతీష్, రమణ శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం



జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి అందుకున్న విద్యార్థితో పాఠశాల ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రోబోటిక్ నమూనా

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్ తెలిపారు. గత శనివారం అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థి సీహెచ్.మణికంఠ తయారు చేసిన ఫ్లోర్ క్లీనర్ రోబోట్ యూజింగ్ స్మార్ట్‌ఫోన్ అనే నమూనాకు ద్వితీయ స్థానం దక్కింది. విజయవాడలో మంగళవారం జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఈ నమూనా ఎంపికైంది. ఈ మేరకు మణికంఠను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

రేగుపాలెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం ముస్లిం కాలనీలో సోమవారం పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు రాజాన శ్రీను తదితరులు గ్రామంలో రూ.2 లక్షలతో సీసీ రహదారి పనులను సోమవారం పర్యవేక్షించి, పనుల్లో నాణ్యతాలోపం లేకుండా చూశారు. పంచాయతీ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులను త్వరలో చేపట్టడానికి ప్రతిపాదించామని సర్పంచ్ మహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు మహ్మద్ గౌస్, ఇంజినీరింగ్ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

180 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: పి.ధర్మవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖపట్నం సాగర్‌దుర్గా హాస్పిటల్ వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 180 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేయగా.. 36 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలిస్తున్నట్టు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి పీఆర్వో రవి, స్థానికులు కలిగట్ల మాణిక్యం, బండి నాగేశ్వరరావు, శానాపతి బాబూరావు, పినపాత్రుని గణేష్, సారిపల్లి అశోక్, దమ్ముంరాజు, ఆకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి ఆహార పొట్లాల పంపిణీ



నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందిస్తున్న ఉపాధ్యాయుడు రాంబాబు

యలమంచిలి రూరల్: యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్-2 కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడు(పీజీటీ)గా పని చేస్తున్న ముళ్ళ రాంబాబు సోమవారం మరోసారి తన సహృదయాన్ని చాటుకున్నారు. శ్రీశక్తి పీఠం మాతాజీ రమ్యానందభారతీ స్వామి జన్మదినం సందర్భంగా ఆయన పట్టణంలోని బస్టాండు సాయిబాబా ఆలయం వద్ద 100 మంది వృద్ధులు, నిరాశ్రయులు, రోజువారీ కూలీలు, బిచ్చగాళ్లకు ఆహార పొట్లాలు అందజేశారు. రాంబాబు దాన గుణాన్ని పలువురు సహ ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ తీరును నిరసిస్తూ నేడు ఆటో కార్మికుల సదస్సు



సదస్సు కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఆటో కార్మికులు

యలమంచిలి రూరల్: ఇప్పటికే ఎన్నో ఇబ్బందులతో పూట గడవడమే కష్టంగా ఉన్న ఆటో, మోటారు రంగంపై ఆధారపడి పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారమే అజెండాగా మంగళవారం యలమంచిలి పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయం వద్ద సదస్సు నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సుదాసు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆటో స్టాండు వద్ద సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆటో కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో, మోటారు కార్మికుల పొట్ట కొట్టేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉంటున్నాయని విమర్శించారు. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమ జీవనోపాధిని దెబ్బ తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించనున్న యలమంచిలి డివిజన్ ఆటో, మోటారు కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లిమళ్ల నాగు, వివిధ గ్రామాల ఆటో యూనియన్ల నాయకులు బాషా, విశ్వనాథం, నగిరెడ్డి శివ పాల్గొన్నారు.

'గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇవ్వాలి'

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ హైడ్రోజన్ ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్‌లో పూడిమడక వాసులకు ఉద్యోగాలు కల్పించాలని వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చోడపల్లి అప్పారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్లాంట్‌కు ఈ నెల 8న ప్రధాని వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని, అదే సమయంలో ప్లాంట్ ఏర్పాటు కారణంగా నిర్వాసితులైన వారికి ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తారో వెల్లడించాలని కోరారు. 1200 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్లాంట్‌కు సమకూర్చిన స్థలం రైతుల త్యాగాల వల్ల లభించిందని గుర్తించుకోవాలన్నారు. వాయు, జల కాలుష్యాలతో ఉపాధికి కోల్పోయిన మత్స్యకారులకు కూడా న్యాయం చేయాలన్నారు.